# గానుగెద్దు

మా మాష్టారు, పాఠాలు సరిగా చదవని వాళ్లనీ, ప్రశ్నలకు సరిగా సమాధానాలు చెప్పలేని వాళ్లనీ "ఒరేయ్ నీకంటే 'గానుగెద్దు' నయం రా!" అంటూండేవారు.

మా క్లాసులో 'మొద్దబ్బాయి నెంబరు వన్' రామిగాడున్నాడు. మిగతా వాళ్లకు పుస్తకం అంతా వచ్చేసినా వాడికి మాత్రం మొదట పాఠం కూడా వచ్చేది కాదు. అందువల్ల మాష్టారు వాణ్ణి ఎప్పుడు చూచినా 'ఒరేయ్ "గానుగెద్దూ!" అని పిలుస్తూండేవారు. ఈ రామిగాణ్ణి 'పప్పు రాము' డనీ, 'గానుగెద్దు' అని మాష్టారుతో పాటు పిల్లలందరూ కూడా తెగ వేళాకోళం చేసేవారు.

ఇలా కొంతకాలం జరిగాక, ఎప్పుడు చూచినా, మాష్టారు "గానుగెద్దు" అనడం వింటూంటే, దాని అర్థం ఏమిటో తెలుసుకోవాలన్న ఆదుర్దా మాలో కొందరికి కలిగింది. మామూలుగా పప్పు రాముడంటే, ఎందుకూ పనికిరానివాడని, మా అందరికీ తెలిసిందే! కానీ ఈ "గానుగెద్దే"విటో మాత్రం మాకర్థమయేది గాదు. అందుకని దీని అర్థమేమిటో ఎలాగైనా మాష్టారు నడిగి తెలుసుకోవాలని మేమందరము నిశ్చయించుకున్నాము. కాని, ధైర్యం చేసి, ఎవ్వరమూ ఆయన ఎదటబడి అడగలేక పోతూండే వాళ్లము. ఎన్ని రోజులైనా ఈ కోరిక ఇలాగే నిల్చిపోయింది—మా పిరికితనం వల్ల.

* * *

చివరికొకనాడు మాష్టారు హుషారుగా బలిచక్రవర్తి పాఠం చెబుతున్నారు. మన 'పప్పు రాముడు' గూడా పాఠం వింటూనే ఉన్నాడు. ఇంతలో ఎవరో ఏదో అల్లరి చేశారు పాఠం వినకుండా. మాష్టారు పిల్లలందరివంకా వరసగా చూసుకొస్తూ పప్పురాముడి వంక కూడా చూశాడు.

**శ్రీమతి కృష్ణవేణి**

"ఒరేయ్ బలిచక్రవర్తి ఎలాటి వాడురా?" అని వాణ్ణే ప్రశ్న వేశారు.

పప్పురాముడు "మే...మ్మె...మ్మె..." అన్నాడు.

మాష్టారు వెంటనే, "ఓరి గానుగెద్దా" అని పకపకా నవ్వేరు.


అదే సమయమని "మాష్టారూ, గానుగెద్దని అంటూంటారే, దాని అర్థమేమిటండీ?" అని ఒక్కసారిగా, మాజట్టు జట్టంతా అన్నాము. మాష్టారు ఆవేళ సంతోషంగా ఉన్నారేమో, మేము అడగ్గానే తిట్టకుండా మమ్మల్ని చూసి నవ్వుతూ ఇలా చెప్పారు:-

"ఏం లేదురా అబ్బాయిలూ; దీనికో చక్కని కథవుంది వినండి" చెపుతానన్నారు.

పిల్లలందరూ మాష్టారు ఏం చెబుతారోనన్న ఆత్రంతో చెవులు దొరగిలబెట్టి, చీమ కదిలినా వినిపించేంత నిశ్శబ్దంగా చూచున్నారు.

మాష్టారిలా ప్రారంభించారు:

"మనకు మోటారు కార్లూ, రిక్షాలూ, సైకిల్ రిక్షాలూ, ఆటోరిక్షాలూ, లేని రోజులవి. అప్పుడు రైలుకూడా చాలాచోట్లకు పోయేందుకు వీలులేదు. కాలినడకనో బండ్లమీదనో ప్రయాణం చేసేవారు. అప్పటికి నేను చాలా చిన్నవాణ్ని. అలాంటి రోజుల్లో మా ఊరికి ఒక తాసీల్దారుగారు వచ్చారు. ఆయన మా గ్రామానికి దగ్గరలో ఉన్న బస్తీకిపోయి కలక్టరుగార్ని చూడాల్సి వచ్చింది. ఆరోజుల్లో తాసీల్దార్లకు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లకు, స్వంత గుఱ్ఱపు బండో, ఒంటెద్దుబండో వుండేది. ఈ తాసీల్దారుకుమాత్రం ఏ బండీ లేకపోవడాన, మా ఊరువచ్చి మా గ్రామమునసబుకు కబురుచేసి, తనకు రెండెడ్ల బండిగానీ, ఒంటెద్దు బండిగాని ఏర్పాటుచేయమనీ, మరునాటి ఉదయం 8 గంటలకల్లా కలెక్టరుగారిని చూడాలనీ, అలా వెళ్లకపోతే మాటొస్తుందనీ, చాలా అవసరంగా ఏర్పాట్లు చేయించమనీ చెప్పారు.



అలాంటప్పుడు మన మునసబు గారు, తాసీల్దారుగారి మాట తీసెయ్యగలరా? 'అలాగే బాబూ: సాయంత్రానికల్లా పూర్తి చేయిస్తా' నని ఇంటి కొచ్చాట్ట.

మాట అయితే యిచ్చాడు కానీ అవి కుప్పనూర్పిళ్ల రోజులవడంచేత ఒక ఎద్దు గాని బండి గాని, ఊళ్లో దొరికేట్లు కనిపించలేదు. ఎంతమందినో, బ్రతిమాలే వాళ్లను బ్రతిమాలి, కోపగించే వాళ్లను కోపగించీ, ఎన్నో విధాల తాసీల్దారుగారి వల్ల మాటరాకుండా చూసుకోవాలని ప్రయత్నించాడు మునసబు. ప్రయోజనం లేక పోయింది. ఆఖరుకు ఒక ఒంటెద్దు బండి తోలుకొనే సాయిబు జ్ఞాపకం రాగా, అతనికి కబురుచేసి ఈ విషయమంతా చెప్పాడు.

"బాబూ, నా యెద్దు కాస్తా మొన్న గొడ్ల రోగాల మూలంగా చచ్చిపోయింది. ఎవర్నైనా ఒక ఎద్దును ఇమ్మనండి. కావాలంటే నేనే నాబండికి కట్టుకొని బండివెంట పోయి బాబుగార్ని బస్తీలో దిగవిడిచి వస్తాను." అన్నాడు సాయబు.

"సరే అలాగయితే నేను విచారించి కబురు చేస్తాను, నువ్వు మాత్రం సిద్ధంగా ఉండ"మన్నాడు మునసబు 'సరే' నని సాయిబు ఇంటికెళ్లాడు.

"ఆ సాయంత్రం ఎటూ దిక్కు తోచక మునసబు తెలుకుల వీరయ్యకు కబురుచేసి, అతని నూనెగానుగకు కట్టే ఎద్దును ఇచ్చేటట్టు ఏర్పాటుచేసి సాయిబుకు ఆయెద్దు నప్పగించి ఆరాత్రి 9 గంటలకు తాసిల్దారు గారిని ప్రయాణం చేశాడు. తాసిల్దారుగారు, పెందరాడే భోజనం వగైరాలు ముగించుకొని ప్రయాణానికి సిద్ధమయారు. వీరితోపాటు ఊరి పొలిమేర వఱకు మునసబు వెళ్లి సాగనంపి వచ్చేశాడు.

బండి చేల కడ్డంబడి పోతున్నది. గానుగ తిరగడమేగాని బండిలాగే అలవాటులేని ఈఎద్దు, దారి పొడుగునా నడవడానికి చాలా హంగామా చేసింది. ఇలా కొంత సేపు ప్రయాణం చేశాక, అంటే అప్పటికి రాత్రి 12 గంటలుండచ్చు- తాసీల్దారుగారూ, బండితోలే సాయిబూ కునకడం ప్రారంభించారు.

( -వ పేజీ చూడండి)

# ★ విచిత్రవ్యక్తి ★

(33–వ పేజీ తరువాయి)

వును, ముక్కుపచ్చలారని ఈ ఇద్దరు పసిగందులను కూడా ప్రలోభపరచింది. ఈ బంగారు నాణేలతో గనక నోరుంటే తాము ఒక మత గురువును కూడా లొంగదీసుకున్నందుకు గర్విస్తున్నామని తప్పక చెప్ప గలవు."

న్యాయవాది కూర్చున్నాడు. విల్హెల్మ్ లేచాడు.

"ఈ డబ్బు రెండేళ్ల కిందట రోడ్డుమీద తనకు దొరికిందని ఫిర్యాది చెబుతున్నాడు. అంతేగదండీ?" అని విల్హెల్మ్ జ్యోతిష్కునికేసి తిరిగి అడిగాడు. జ్యోతిష్కుడు అవునన్నాడు.

"ఆవిధంగా దొరికిన ధనం ఒకానొక దినం వరకూ అంటే గత డిసెంబరు మాసం ఆఖరు తేదీ వరకూ తనవద్దనే ఉందనికూడా ఫిర్యాది చెప్పాడు. అంతేకదండీ?" అని మళ్ళీ అడిగాడు. జ్యోతిష్కుడు మళ్లీ తల ఊగించాడు. విల్హెల్మ్ జడ్జీలకేసి తిరిగి "కోర్టులో హాజరు పరచబడిన ధనమున్నూ, ఫిర్యాదికి దొరికిన ధనమున్నూ ఒకటి కాదని నేను నిరూపిస్తే ఈ ధనం ఫిర్యాది ధనం కాదని ఋజువైనట్లే కదా ?" అన్నాడు.

"అవును. కాని అదెలా కుదురుతుంది? మీకు కొత్తసాక్షు లెవరైనావుంటే ముందుగానే మాకు తెలియపరచవలసివుంది," అని ఒక జడ్జీ అని మిగతా జడ్జీలతో ఏదో సంప్రదించసాగాడు. ఈ లోగా ప్రతి పక్షపు న్యాయవాది కోపంతెచ్చుకుని లేచి, ఇప్పుడు కొత్త సాక్షులను ప్రవేశపెట్టడం అన్యాయమని వాదించాడు.

"నేను ప్రవేశపెట్టబోయేది కొత్త సాక్షినికాదు, పాత సాక్షినే. ఆ సాక్షిని కోర్టువారు కొంతవరకూ పరీక్షించారు కూడాను," అన్నాడు విల్హెల్మ్.

"ఎవరది?"

"ఈ ధనమే."

"ఈ ధనమా ? ఈ ధనం ఏమిచెబుతుంది?"

"ఏమి టేమిటి ? ఏదైనా చెబుతుంది. జ్యోతిష్కుడికి దొరికిన డబ్బు తనుకాదనీ, జ్యోతిష్కుని వద్ద నుండి డబ్బుపోయిన తర్వాతే తను పుట్టాననీ చెబుతుంది. మాటల్లో చెప్పలేకపోయినా, తనమీద గల సంవత్సరం సంఖ్య ద్వారా సాక్ష్యం చెప్పగలదు."

కోర్టులో పెద్ద అలజడి చెలరేగింది. ప్రతి పక్ష న్యాయవాది, జడ్జీలు కంగారుపడి గబగబ నాణాలుతీసి పరిశీలించారు. "అరె! అరె!" అని విస్తుపోయారు. "నిజమే, నిజమే" నన్నారు. అందరూ విల్హెల్మ్‌ను ఒకటే మెచ్చుకోవటం మొదలెట్టారు. అతనికి అంత మంచి ఆలోచన, ఎవరికీ తట్టనిది తట్టినందుకు ఆశ్చర్య పడ్డారు. చివరికి న్యాయమూర్తులు ఇలా తీర్పు ఇచ్చారు.

"ఈ బంగారు నాణాల్లో నాలుగు తప్ప మిగతా వన్నీ కొత్త సంవత్సరంలో ముద్రించబడినవే. కనుక కోర్టువారు, అమాయకుడు, నిర్దోషి అయిన ముద్దాయికి తమ హృదయపూర్వక సానుభూతి తెలుపుతు న్నారు. దురదృష్టవశాత్తు జరిగిన పొరపాటువల్ల ఆయనకి కష్టం కలిగించినందుకు విచారిస్తున్నారు. కేసు కొట్టివేయడమైనది."

జనం అంతా లేచి ఇవతలకొచ్చారు. మార్గరెట్‌ను అభినందించారు. తరువాత విల్హెల్మ్‌ను అభినందించారు. ఈలోగా సైతాను విల్హెల్మ్‌లోనుంచి ఇవతలకొచ్చి నుంచున్నాడు. జనం అతనిగుండా నడిచి పోతున్నారు, అక్కడ ఏమీ లేనట్టే.

విల్హెల్మ్ తనకు నాణాలమీద అంకె సంగతి ఎలా తట్టిందో తనకే తెలియటం లేదన్నాడు. తనకు ఆ నాణాలు ఏ సంవత్సరానివో అదివరకు తెలియక పోయినా, ఆక్షణంలో తెలిసినట్టు అనిపించిందన్నాడు. విల్హెల్మ్ మంచివాడు గనక ఆమాట అన్నాడు. ఇంకో డైతే తనకు మొదటినుంచీ తెలుసుననీ, గమ్మత్తుచేద్దామని చివరిదాకా బయటపెట్టలేదని కోతలుకోసేవాడే.

సైతాను ఇవతలకు రాగానే విల్హెల్మ్ తేజస్సు తరిగి మామూలు మనిషి అయ్యాడు. మార్గరెట్ అతన్ని మెచ్చుకుని 'నిన్ను చూసి గర్విస్తున్నాను,' అన్నది. ఆముక్క విని మళ్లీ అతనికళ్లలోకి ఇందాకటి